క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడి మూల విరాట్

వేముల : మండలంలోని గొల్లలగూడూరులో శ్రీకృష్ణ ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గ్రామంలో రూ.40 లక్షలతో శ్రీకృష్ణ ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం ఆలయంలో వేదమంత్రోచ్చరణల మధ్య శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్టను పురోహితులు ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు



ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

సింహాద్రిపురం : స్థానిక శ్రీమహాగణపతి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం ఉదయం యంత్ర ప్రతిష్ట, బింబన్యాసం, ప్రాణ ప్రతిష్ట, ఉత్సవ విగ్రహ చర ప్రతిష్ట, హోమాలతోపాటు ధ్వజ శిఖర ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ముగిసిన వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : బుసిరెడ్డిపల్లెలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ సీతారామ సమేత లక్ష్మణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఉదయం సీతారామ స్వామి విగ్రహాల ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్ట కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవంలో కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి దంపతులు ఉభయదారులుగా కూర్చున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం వెలకట్టలేనిది



రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

పులివెందుల రూరల్ : రక్తదానం వెలకట్టలేనిదని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, హెచ్ఓడీలు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ కల్యాణిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ రక్తదానం చేసే రక్తదాత పునర్జన్మ ఇస్తారని.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువతకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఆది నరేష్, ఎస్ఏహెచ్ఎస్ సమితి అధ్యక్షుడు రాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

30 పోలీస్ యాక్టు అమలు

జమ్మలమడుగు రూరల్ : నియోజకవర్గంలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని ఏవరైన ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఉరేగింపులు చేయాలనుకుంటే పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని లేకుంటే పోలీస్ శాఖ వారు చర్య తీసుకుంటారని జమ్మలమడుగు డీఎస్పీ డాక్టర్ టి.యశ్వంత్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్ధన మందిరాల వద్ద నిబంధనల ప్రకారం ధ్వని తక్కువ ఉండాలన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు ఏర్పాటు చేసే ముందు సంబంధిత పంచాయతీ, మునిసిపల్ అధికారుల అనుమతి తీసుకుని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఒకరిని కించపరిచే విధంగా ఉండకూడదన్నారు.

వలంటీర్ల కృషి ఎనలేనిది



కొండాపురంలో వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పులివెందులలో వలంటీర్లతో ఎంపీపీ, మండల ఉపాధ్యక్షుడు, ఎంపీడీఓ, తదితరులు



సింహాద్రిపురంలో వలంటీర్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న వైఎస్ మధురెడ్డి

పులివెందుల రూరల్ : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల కృషి ఎనలేనిదని ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో వలంటీర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోవిడ్ విపత్తు సమయంలో కూడా వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలను ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎంపీపీ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంతో వలంటర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, అనూష, ఎంపీటీసీ వేణు యాదవ్, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం

సింహాద్రిపురం : గ్రామీణ ప్రాంతాలలో వలంటీర్ల సేవలు అమోఘమని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ సాల్మన్ రాజు అధ్యక్షతన వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. మండలంలో 5 మంది వలంటీర్లకు సేవా రత్న అవార్డులు... మిగిలిన 165 మంది వలంటీర్లుకు సేవా మిత్ర అవార్డులు వరించాయి. ఈ అవార్డులు పొందిన వలంటీర్లను వైఎస్ మధురెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నెడ్ క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ కిశోర్‌రెడ్డిలు శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలతోపాటు మెడల్స్‌ను అందించారు. ఈ సందర్భంగా వైఎస్ మధురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో కూడా వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలకు చేర్చిన ఘనత వలంటీర్లకు దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమంతా వలంటీర్ల సేవ గురించి కొనియాడుతున్నారన్నారు. వచ్చె ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడం కోసం ప్రతి వలంటీర్ తన వంతు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ నేడుదేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో కూడా వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిత, మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం ప్రతి ఇంటింటికి వెళ్లిందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కొండాపురం గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగనన్న ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం ప్రజలకు 99 శాతం సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. ఒక్క రుపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలను అర్హత ఉన్న లబ్ధిదారులకు అందించి ఇతర రాష్ట్రలకు ఆదర్శంగా నిలిచారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నాయకులు తప్పుడు హామీలతో మీ ముందుకు వస్తున్నారని ఎవరు మోసపోవద్దన్నారు.

గతంలో చంద్రబాబు ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయాడన్నారు. వైఎస్ జగనన్న గండికోట నిర్వాసితులకు తొలి విడత 14 గ్రామాలకు రూ.160 కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఎండీఓ నాగప్రసాద్, ఎఓ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు చింతరాజారెడ్డి, మండల కన్వీనర్ జగధీశ్వర్‌రెడ్డి, ఉపమండలాధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కొండు రామిరెడ్డి, రామంజులరెడ్డి, ప్రవీణ్ యాదవ్, చోటు, మైనార్టీ మండల అధ్యక్షుడు ఖాదర్‌బాషా, శేఖర్, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన సదస్సు

వీరపునాయునిపల్లె : స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఎకనామికల్ డెవలప్‌మెంటు సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఓటు హక్కు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక సభ్యుడు సుజన్‌కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాదాన్యత గురించి వివరించారు.

అమ్మ భాషకు ఆయువు పోద్దాం

వేంపల్లె : అమ్మ భాషకు ఆయువు పోయడం ద్వారా ఆయా జాతుల మనుగడకు దోహదం చేసినవారమవుతామని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బిడ్డ ఎదుగుదలకు అమ్మ పాలు ఎంత అవసరమో.. ఆ బిడ్డ వికాసానికి మాతృ భాష కూడా అంతే అవసరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

మము కరుణించరావా శ్రీవేంకటరమణ



పల్లకిలో అద్దంలో కనిపిస్తున్న మోహినీ అలంకారంలో శ్రీవారు

పులివెందుల టౌన్ : పులివెందులలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం 6వ రోజు స్వామివారు ఉదయం పల్లకిలో మోహినీ ఉత్సవం నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అలంకారంలో స్వామివారు దివ్య మంగళ స్వరూపంతో దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపించారు. పల్లకిలో స్వామివారి ఎదుట నిలువుటద్దం ఏర్పాటు చేశారు. స్వామివారిని భక్తులు అద్దంలో చూచి తరించారు. పట్టణ పురవీధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయంలో సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్ర నామార్చన, నివేదన, నిత్యహోమం, కలశారాధన, బలిహరణం ఇత్యాది పూజలను చేసి హారతి, తీర్థప్రసాదాల వినియోగం చేపట్టారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు కల్యాణం

వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వరోజు గురువారం ఉదయం హనుమద్వాహనం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించి అనంతరం గజవాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

గ్రామాల్లో బండలాగుడు పోటీలకు ఆదరణ



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి

వేముల : గ్రామాల్లో బండలాగుడు పోటీలకు నేటికి ఆదరణ తగ్గలేదని రైతులు ఉత్సాహంగా పాల్గొంటూ పండుగలా జరుపుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డిలు తెలిపారు. మండలంలోని గొల్లలగూడూరు గ్రామంలో బుధవారం శ్రీకృష్ణ ఆలయ విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన దేశవు ఎద్దుల బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలలో వేంపల్లెకు చెందిన గాజులపేటకు చెందిన రమణ ఎద్దులు 3250 అడుగులు లాగి ప్రథమస్థానం, అనంతపురంకు చెందిన బసన్న ఎద్దులు 2902 అడుగులు లాగి రెండవ స్థానం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన నల్లయ్య ఎద్దులు 2572 అడుగులు లాగి మూడవ స్థానం, కర్నూలు జిల్లా దేవరకొండకు చెందిన జస్వేన్ ఎద్దులు 2422 అడుగులు లాగి నాల్గవ స్థానం, పెర్నపాడుకు చెందిన ఎస్.రామాంజనేయులు ఎద్దులు 2283 అడుగులు లాగి 5వ స్థానం, అనంతపురం జిల్లా గుత్తికి చెందిన మహమ్మద్ ఎద్దులు 2255 అడుగులు లాగి 6వ స్థానం, అనంతపురంకు చెందిన పోతిరెడ్డి ఎద్దులు 2160 అడుగులు లాగి 7వ స్థానంలో నిలిచాయి. వీరికి రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేల చొప్పున బహుమతులను అందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బుధవారం పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాజీవ్ కాలనీ సచివాలయ పరిధిలోని ప్రజలకు రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అత్యవసర చికిత్సలు అవసరమైన వారికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అనంతరం ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, రాజా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులను త్వరగా రికవరీ చేయండి

ఎర్రగుంట్ల : ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల నుంచి బిల్లులను తర్వగా రికవరీ చేయాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులు, హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను కాంట్రాక్టర్లు పూర్తి చేశారన్నారు. అయితే కట్టిన ఇళ్లకు లబ్ధిదారుల ఖాతాలలో పడిన నగదును రికవరీ చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని కమిషనర్ అధికారులను కోరారు. జమ అయిన బిల్లు డబ్బులు లబ్ధిదారులు వారి స్వంత ఖర్చులకు వాడుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైన లబ్ధిదారులు పెండింగ్‌లో ఉన్న బిల్లు డబ్బులను వారంలోగా చెల్లించాలని అదేశించారు. లేదంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బిల్లులు తీసుకుని ఇళ్లు పనులు చేయని కాంట్రాక్టర్లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే బిల్లులను రికవరీ చేయాలని మెప్మా అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణ, మెప్మా సీఓ వసంతరెడ్డి, సచివాలయ సెక్రటరీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు

ముద్దనూరు : పెద్దలు కుదుర్చిన పెళ్లి, నిశ్చితార్థం కాదని మరో అమ్మాయిని పెళ్లి చేసుకుని తనను మోసం చేశాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు ముద్దనూరులో నివసిస్తున్న రాధామణి అనే యువతికి ఎర్రగుంట్లకు చెందిన పాలవర్ధన్‌తో పెద్దలు పెళ్లి సంబంధం కుదిర్చారు. గత ఏడాది సెప్టెంబర్ 8వ తేదీన పాలవర్ధన్ అతని తల్లితండ్రులు, బంధువుల సమక్షంలో నిశ్చితార్థంకూడా జరిగింది. అదే రోజు పాలవర్ధన్‌కు పెళ్లిఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు తర్వాత ఇతర ఖర్చులకు గాను మరో రూ.3 లక్షలు చెల్లించారు. 1 సంవత్సరం తర్వాత ఇరువురికి పెళ్లి జరిగేటట్లు నిర్ణయించారు. అయితే పాలవర్ధన్ అధిక కట్నంకోసం ఆశపడి మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధితురాలు రాధామణి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రాధామణి ఫిర్యాదు మేరకు పాలవర్ధన్‌తో సహా 8 మందిపై మోసం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం వలంటీర్లకు వందనం, అలాగే గోపవరం దగ్గర నూతనంగా నిర్మించిన మాతంగి శ్యామలదేవి ఆలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ ప్రతినిధులు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు, పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వీరపునాయునిపల్లె : స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, సర్పంచులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99631 70 177, 08568286189 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రారంభమైన వార్షికోత్సవ ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలోని కాటారెడ్డి కాలువ వద్ద వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన, లక్ష్మినరసింహస్వామి 20వ వార్షికోత్సవ ఉత్సవాలు బుధవారం ప్రారంభమైయ్యాయి. ఉదయం అర్చకుల ఆధ్వర్యంలో హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు బండలాగుడు పోటీలు : కాశిరెడ్డి నాయన వార్షికోత్సవ ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం సేద్యం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వల్లూరు : మండల పరిధిలోని తప్పెట్ల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం మండలంలోని కోగటం గ్రామానికి చెందిన జిలానీ బాషా గాయపడ్డాడు. జిలానీ బాషా కడప నుండి స్వగ్రామానికి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం, కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపుకు వెళుతున్న లారీ తప్పెట్ల వద్ద ఢీకొన్నాయి. స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం అతన్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

ముఖ్యమంత్రిపై బీటెక్ రవి వ్యాఖ్యలు హాస్యాస్పదం



విలేకరులతో మాట్లాడుతున్న మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, తదితరులు

వేంపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నేత బీటెక్ రవి వ్యాఖ్యలు హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.చంద్రఓబుళరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధం బహిరంగ సభల్లో లక్షల మంది జనసంద్రం కావడంతో టీడీపీ నేతలు ఓర్వలేక సీఎం వైఎస్ జగన్‌పై చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. మేం సిద్ధమే మీరు సిద్ధమా అని సవాల్ విసరడమే ఈ బహిరంగ సభల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కానీ టీడీపీ నేతలు దేనికి సిద్ధమంటూ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడం సరికాదన్నారు. టీడీపీ నేత బీటెక్ రవి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చారని.. అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీగాయత్రి, హజ్ హౌస్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మునీర్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు అధ్యక్షుడు రవి శంకర్‌గౌడ్, కో ఆప్షన్ అస్సాన య్య, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 17వ వార్డు గడ్డ వీధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని సంక్షేమ పథకాలపై లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయాడన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24వేలు, అలాగే వైఎస్సార్ నేతన్ననేస్తంతోపాటు, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ ఇస్తున్నారన్నారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, వార్డు కౌన్సిలర్ నూరుస్సీసా, గౌరీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు వెన్నముక లాంటి వాడు




ఆర్‌జేడీ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు

కమలాపురం : పాఠశాలల అభివృద్ధిలో వ్యాయామ ఉపాధ్యాయుని పాత్ర కీలకం అని, పాఠశాలకు ఆయన వెన్నముక లాంటి వాడని పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయుల బృందం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంత ముఖ్యమో, పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయుడు అంతే ముఖ్యమన్నారు. పాఠశాలకు పీఈటీ, పీడీలు వెన్నముక లాంటి వారన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులను దృఢంగా తీర్చిదిద్దాలంటే అది వారికే సాధ్యమన్నారు. ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే వ్యాయామ ఉపాధ్యాయుల్లో ఉన్న ప్రతిభను ఒకరికొకరు పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రతి ఉన్నత పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, స్కౌట్ ప్రాధాన్యతను వివరించారు.

100శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ రాఘవరెడ్డి తెలిపారు. పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. సిలబస్, పరీక్షలు, ఫలితాలు తదితర వాటిపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే 100శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఉదయం 5 గంటలకే నిద్ర లేవాలని, రాత్రి 11 వరకు చదవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి అరుణ కుమారి, నియోజకవర్గ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ సునీల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివ శంకర్‌రెడ్డి అన్ని మండలాల పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దు



డీఎస్పీ కె.ఎస్.వినోద్‌కుమార్

పులివెందుల : పులివెందుల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో మున్సిపల్, పంచాయతీ అధికారులు అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పులివెందుల డీఎస్పీ కె.ఎస్.వినోద్‌కుమార్ ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందిన చోట మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. విద్వేషాలు రగిల్చేలా ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. మోటార్ సైకిల్, ఆటో, కారు ర్యాలీలకు అనుమతి లేదని.. ముందస్తు అనుమతితో సాధారణ నడక ర్యాలీలకు మాత్రమే నిబంధనల మేరకు అనుమతించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు పోలీసు అధికారులనుంచి అనుమతి పొందిన తేదీ, సమయం, రూట్‌లోనే వెళ్లాలని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదన్నారు. ర్యాలీలలో ఇతరులకు హాని కలిగించే ఎలాంటి వస్తువులు తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని... వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎప్పటికప్పుడు పోలీసు అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే డీజేఈలకు అనుమతి లేదని.. లౌడ్ స్పీకర్లు సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ఇతరులకు ఇబ్బంది లేకుండా వినియోగించాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలోనూ, ఎలాంటి కార్యక్రమాల్లో కూడా డీజేలకు అనుమతి లేదన్నారు. అలాగే పాఠశాలలు, ప్రార్థనా మందిరాల వద్ద ఎట్టి పరిస్థితులలో మైక్ లేదా లౌడ్ స్పీకర్‌ను వినియోగించకూడదన్నారు. పులివెందుల పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ప్రతి ఒక్కరు సూచనలు పాటిస్తూ ప్రజల శాంతి భద్రతలను సమర్థంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

